# తీరికేది?

నల్లకుంట దాటి యూనివర్సిటీ రోడ్డులోకి మలుపు తిరగ్గానే ఎప్పటికి మల్లే విశ్వనాధంగారు గుర్తొచ్చారు. వారు దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కాలనీలో ఉంటున్నారు. పిల్లలిద్దరూ అమెరికాలో సెటిలయ్యారు. విశ్వనాధంగారు తెలుగు లెక్చరర్‌గా పనిచేసి ప్రొఫెసర్‌గా రిటైరై పదేళ్లు దాటింది. కీళ్లనొప్పులు, ఎముకల్ని మెలితిప్పేసిన ఆర్థ్రరైటిస్, దానికితోడు రెండేళ్ళ క్రితం బైపాస్ సర్జరీ అయింది.

నేను చూడటానికి వెళ్ళిన ప్రతిసారి "నిర్మలా.... చూడు మన మానస పుత్రుడొచ్చాడు" అంటారు. అక్కడ వేరే వాళ్ళెవరైనా వుంటే నన్ను పరిచయం చేస్తూ "మా మూడో అబ్బాయి" అని పసిపిల్లాడిలా నవ్వుతారు.

"మీకు యిద్దరే కదూ పిల్లలు" అని వాళ్ళనటమే తరువాత ఠక్కున సమాధానం వస్తుంది.

"కంటేనా పిల్లలు... యిద్దర్ని కన్నాం - కష్టపడి చదివించాం. పెద్ద పెద్ద ఉద్యోగాలొస్తే మా అదృష్టమని మురిసిపోయాం. కానీ చివరికేమైంది? మా అతీగతీ పట్టించుకునే ధ్యాస వాళ్ళకు లేదు. ఏదో మొక్కుబడి తీర్చుకున్నట్లు నెలకింత డబ్బు పంపిస్తే సరిపోయిందా... మాకీ వయసులో కావాల్సింది పిడికెంత ఆదరణ. ప్రేమగా మాట్లాడే నాలుగు మాటలు.... అంతే. ఇదుగో అవన్నీ మాకు దొరికింది ఇతని వల్లనే" అలా అంటున్నప్పుడు ఆయన కళ్ళు చెమర్చటం నేను చాలాసార్లు గమనించాను.

వారితో మా సాన్నిహిత్యం మానాన్నతో ప్రారంభమైంది. ఇద్దరూ నిజాం కాలేజీలో డిగ్రీ వరకూ కల్సి చదువుకున్నారు. ఒకేసారి ఉద్యోగంలో చేరారు. నా చిన్నప్పుడు

విశ్వనాథంగారు భార్యాపిల్లల్తో కలిసి మా యింటికి భోజనాలకు వచ్చేవారు. మేమూ వాళ్ళింటికెళ్ళే వాళ్ళం. వాళ్ళ రెండో అబ్బాయి శ్రీధర్ నేనూ ఒకే ఈడువాళ్ళం.

దురదృష్టం మా యింటి తలుపు తట్టిన ఆ రోజు నాకింకా గుర్తుంది. ఆదివారం సాయంత్రం విశ్వనాథంగారింటికెళ్ళాలని బయల్దేరాం. అమ్మ స్కూటర్ వెనక కూచుంది. నేను వాళ్ళిద్దరి మధ్య సర్దుకున్నాను. సిటీ బస్సును తప్పించబోయి స్కూటర్ని పక్కకు కోశారు. ఆ కంగారులో ఎదురుగా వస్తున్న కారుని చూసుకోలేదు. నాన్న తలకు బలమైన గాయమైంది. నాకు అమ్మకు చిన్న చిన్న దెబ్బలు తగిలాయి. హాస్పిటల్లో వారం రోజులుండి నాన్న చనిపోయారు.

దేవుడున్నాడో లేడో నాకు తెలీదు. కానీ ఉంటే మాత్రం విశ్వనాథంగారిలా ఉంటాడని నాకు ఆ తర్వాతే తెల్సింది. బంధువులందరూ మొహం చాటేశారు. హాస్పిటల్ బిల్లు కట్టడానికి డబ్బుల్లేని పరిస్థితి. అంతా ఆయనే దగ్గరుండి చూసుకున్నారు. తనకు తెల్సినవాళ్ళ కాళ్ళూ గెడ్డాలూ పట్టుకుని ఎలాగైతేనేం అమ్మకు టీచర్‌గా ఉద్యోగం ఇప్పించారు. మా కష్టాల్లో, సుఖాల్లో పాలు పంచుకున్నారు. శ్రీధర్‌ని ఎంత ప్రేమగా పెంచారో నన్నూ అంతే శ్రద్ధతో, వాత్సల్యంతో పెంచారు. ఆయన నాకు తండ్రిలాంటివారు. ఎంత చేసినా ఆయన ఋణం తీర్చుకోలేనిది.

అందుకే ఈ మధ్య గిల్టీగా ఉంటోంది. కొన్ని నెలలుగా ఆయన్ని కలవటమే కుదరటం లేదు. పని ఒత్తిడి... సంసార బాధ్యతలు... వూపిరి తీసుకోడానికి కూడా తీరిక లేనట్లు..... ఎంత చేసినా ఏదో పని బాకీ ఉన్నట్లు.... ఎవరో వెంట పడి తరుముతున్నట్లు పరుగు.... రోజుకి ఇరవై నాలుగు గంటల సమయం సరిపోవటం లేదు.

ఉదయం ఆఫీసుకి బయల్దేరే ముందు కూడా అమ్మ గుర్తుచేసింది. "నిన్న రాత్రి కూడా ఫోన్ చేశారు. ఒక్కసారి వెళ్ళి చూసిరా బాబూ. మనకు మిగిలిన పెద్దదిక్కు ఆయనే"

కానీ చేయాల్సిన పనులు ఎన్ని ఉన్నాయో... దానికి తోడు బంధించినట్లు, తప్పించుకోలేని ఆఫీసు పని... సమయం ఆరు కావస్తోంది. తార్నాకలో ఉన్న మా బ్రాంచాఫీసుకెళ్ళి పని పూర్తయ్యాక బాస్‌కి ఫోన్ చేసి చెప్తే గాని వెసులుబాటు దొరకదు. కనీసం ఎనిమిదింటికయినా ఈ పని పూర్తయితే తిరిగొచ్చేటప్పుడు తప్పకుండా వారిని చూసి పలకరించి రావాలని నిర్ణయించుకున్నాను.

రాత్రి తొమ్మిదిన్నరకు పనైంది. అప్పటికి నిద్రపోయి ఉంటారు. వయసు పైబడింది కదా. సాయంత్రం ఏడింటికే భోంచేసి తొమ్మిదింటికల్లా పడుకోవటం ఆయనకలవాటు. యింటికొచ్చి భోజనానికి కూచున్నప్పుడు ఫోన్ మోగింది.

"ఈ రోజు తప్పకుండా వస్తానన్నావ్... మరచిపోయవా బాబూ" అన్నారు విశ్వనాథం గారు.

"మీరింకా మేలుకునే ఉన్నారా? నిద్రపోయి ఉంటారనుకుని రాలేదు."

"నువ్వొస్తావని ఎదురుచూస్తూ కూచుంటే నిద్రెలా వస్తుంది బాబూ."

చాలా బాధనిపించింది. "అయ్యో... సారీ... రేపెలాగైనా వస్తాను" అన్నాను నొచ్చుకుంటూ.

పిల్లలిద్దరూ అమెరికాలో ఉన్నారు.... సముద్రాల కవతల... వాళ్ళు చూడాలనుకున్నా చూడలేనంత దూరం... నేను ఇదే నగరంలో ఉన్నాగా. అనివార్యమైన ట్రాఫిక్ జాంలను లెక్కలో తీసుకున్నా గంట ప్రయాణం. అంతే. వారు చూడాలంటూ పిలుస్తున్నా వెళ్ళలేకపోవటం క్షమార్హం కాదు. మరునాడు తప్పకుండా వారిని కలవాలని నిర్ణయించుకున్నా.

ఉదయం నుండి సాయంత్రం వరకు ఆఫీసులో వూపిరాడనంత పని. సాయంత్రం ఆరింటికి బైటపడి విశ్వనాథం గారింటికి బయల్దేరే లోపలే ఇంటినుంచి శివాని ఫోన్ చేసింది. బాబుకు విపరీతమైన జ్వరమట. ఉదయం నుండీ మూసిన కన్ను తెరవలేదట.

"బాబుకలా ఉంటే ఇప్పుడా చెప్పేది" అని కసురుకున్నా.

"తగ్గిపోతుందనుకున్నానండీ. ఆఫీసులో బిజీగా ఉంటారుగా. కంగారు పడ్తారని చెప్పలేదు. ఇప్పుడు చూస్తే జ్వరం పెరిగినట్లనిపిస్తోంది. వళ్ళు నిప్పులా కాలుతోంది. భయమేసి మీకు ఫోన్ చేస్తున్నా" అంది.

విశ్వనాథంగారింటికెళ్ళడాన్ని వాయిదా వేసుకుని హడావిడి పడ్తూ యింటికెళ్ళాను. బాబుని హిమాయత్‌నగర్‌లో ఉన్న డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాం. తిరునాళ్ళలో జనాలున్నట్లు... అక్కడ కూచోడానికి కూడా ఖాళీ లేదు. జనాభాతో పాటు జబ్బులూ పెరుగుతున్నాయేమో...

మా వంతు వచ్చి... లోపలికెళ్ళి డాక్టర్‌కి చూపించుకుని బైటికొచ్చేప్పటికి తొమ్మిది దాటింది. దార్లో మందులు కొనుక్కుని యింటికొచ్చాక మొట్టమొదట చేసిన పని

విశ్వనాథంగారికి ఫోన్ చేయటమే.

"పర్లేదులే. బాబుని డాక్టర్‌ని చూపించడం ముఖ్యం కదా. సంసార జంఝాటంలో పడ్డాక ఎలా ఉక్కిరిబిక్కిరౌతామో నాకు తెలియంది కాదుగా. నేనెక్కడికి పోతాను? యింట్లోనేగా ఉండేది. నువ్వు హైరానా పడకు. వీలు చూసుకునే రా. నిన్ను చూసి చాలా రోజులైంది. నేనా కదల్లేని పరిస్థితి... నీకు తెల్సుగా, లేకపోతే నేనే వచ్చేసేవాడిని" అన్నారు.

బాబుకి జ్వరం తగ్గడానికి మూడ్రోజులు పట్టింది. ఎలాగూ ఆదివారం శెలవ కదా. ఆ రోజు తీరిగ్గా వెళ్ళి కన్పించి రావచ్చని శుక్ర, శనివారాలు వేరే పనులు చూసుకున్నాను. శనివారం సాయంత్రం ఆఫీస్‌లో ఓ సర్క్యులర్ వచ్చింది. శంషాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయానికి అతి దగ్గర్లో స్థలాలు ప్లాట్లు చేసి అమ్ముతున్నారనీ, రేపుదయం ఎనిమిదింటికి బస్ ఏర్పాటు చేశారనీ, కొనాలనుకునే ఆసక్తి ఉన్న ఉద్యోగులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని వెళ్ళి చూసి రావచ్చనీ దాని సారాంశం.

"రేపొస్తున్నావుగా" అని అడిగాడు కొలీగ్ శివరాం.

"ఆలోచిస్తా"

"ఏంటి ఆలోచించేది? బంగారం లాంటి అవకాశం.... ఈ ప్లాట్ల బిజినెస్ చేస్తున్నతను నాకు బాగా తెలుసు. నమ్మకస్తుడు. యింతకుముందు శంషాబాద్‌లోనే రెండు వెంచర్లు చేశాడు. ఇది మూడోది. గజం వెయ్యిరూపాయలంటే ఎంత చౌకో తెలుసా... కళ్ళు మూసుకుని తీసుకోవటమే."

"డబ్బు కూడా చూసుకోవాలిగా, రెండొందల గజాల స్థలం తీసుకున్నా రెండు లక్షలు పోయాలి".

"ఒకేసారి కట్టలేని వాళ్ళకోసమేగా ఇన్‌స్టాల్‌మెంట్లలో ఇస్తానంటున్నాడు. మనం సభ్యులుగా చేరితే సరి. నలభై నెలలు, నెలకు ఐదువేల చొప్పున కడ్తే సరిపోతుంది"

"మనకొచ్చే జీతంలోంచి నెలకు ఐదువేలు ప్లాట్ కోసం కట్టేస్తే మిగతా డబ్బుతో ఇల్లు గడుస్తుందా?"

"ఇలా మీనమేషాలు లెక్కిస్తూ కూచుంటే మనం బస్ మిస్సయిపోతాం. ఇప్పుడు కాకపోతే ఎప్పుడు ఇన్వెస్ట్ చేస్తావు? నేను చెప్తున్నా విను. మన ఇన్‌స్టాల్‌మెంట్లు ఐపోయేలో

పల అదే స్థలం గజం నాలుగవేలవుద్ది. ఇంకా ఎక్కువ ధర పలికినా ఆశ్చర్యపోనక్కరలేదు. హైదరాబాద్ చుట్టుప్రక్కల స్థలాల రేట్లు విపరీతంగా పెరిగిపోతున్నాయి. మూర్ఖంగా ఆలోచించి నష్టపోకు" అన్నాడు.

అతను చెప్పింది నిజమేననిపించింది. యింటికెళ్ళాక శివానితో విషయం చర్చించాను.

"మీరు పడిన కష్టాలు మన బాబు పడకూడదండి. వాడి భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని కొద్దిగానైనా ఆస్తులు కొనకపోతే ఎట్లా... కష్టమైనా సరే ఆ మిగిలిన జీతంలోనే సర్దుకుందామండి. మీరు ధైర్యంగా ప్లాట్ బుక్ చేయండి" అంది.

ఆదివారం ఉదయం బస్‌లో సైట్‌కి పిల్చుకెళ్లారు. అదిగదిగో ఆ కన్పించేదే అంతర్జాతీయ విమానాశ్రయం అన్నారు. ఇదిగిదిగో ఈ పక్కనే ఫలానా ఇండస్ట్రీ రాబోతుందన్నారు. కొన్ని నెలలు ఓపిక పడ్తే చాలు మీరందరూ పెట్టిన పెట్టుబడికి పదింతలు దండుకుంటారు అని ఊరించారు. పోలోమని అందరూ సభ్యులుగా చేరిపోయారు.

తిరిగొచ్చేప్పటికి సాయంత్రం నాలుగైంది. నిస్సత్తువగా అన్పించింది. విశ్వనాథం గారు గుర్తొచ్చినా వాయిదా వేశాను. వారే చెప్పారుగా వీలు చూసుకుని రమ్మని. విషయం అర్జెంట్ అయి ఉండదు. వచ్చే ఆదివారం వెళ్ళొచ్చులే అని నాకు నేనే సర్దిచెప్పుకున్నాను.

ఆఫీసులో తొందర్లోనే ఇన్స్‌పెక్షన్ ఉంటుందని చెప్పారు. స్టాక్ ఇన్‌ఛార్జిని నేనే కాబట్టి వారమంతా స్టాక్ సరిచూసుకోవటంలో తలమునకలైపోయాను. ఈ మధ్యలో అమ్మ రెండుసార్లు గుర్తుచేసింది.

"నువ్వు చూస్తున్నావుగా అమ్మా... నాకు తీరికెక్కడిది?" అన్నాను.

పాపం తల్లి మనసు కదా "ఔన్లే నాయనా. ఐనా పెద్దాయన కదా, కలవరిస్తున్నాడాయె. ఓసారెళ్ళి పలకరించి రావటం మాత్రం మర్చిపోకు" అంది.

"ఎలా మర్చిపోతానమ్మా. ప్రతిరోజూ అనుకుంటా. కాని ఏదో ఒక పని నెత్తికెత్తుకోవాల్సి వస్తోంది. నాకు మాత్రం తెలీదా?" అన్నాను.

మరో ఆదివారాన్ని కూడా నా ఇన్స్‌పెక్షన్ మింగేసింది. విశ్వనాథంగారి నుంచి ఫోన్లు కూడా రావటం లేదు. బహుశా వారూ ఏదో వ్యవహారంలో బిజీగా ఉండి ఉంటారు.

మరీ అవసరమైతే ఫోన్ చేసి చెప్పి ఉండేవారుగా అన్పించింది.

"వారు బిజీగా ఉండటం కాదు నాయనా. నిన్నిబ్బంది పెట్టడం ఇష్టం లేక ఫోన్ చేయటం లేదు. అది వారి సౌజన్యం. ఒక్కసారి కన్పించిరా బాబూ. నువ్వు తీరిక లేకుండా ఉన్నావు నిజమే. కానీ ఎలాగోలా వీలు చూసుకుని వెళ్ళిరా" అంది అమ్మ.

వచ్చే ఆదివారం తప్పకుండా వెళ్ళాలనుకున్నా, ఆ రోజు వేరే పనులేమీ పెట్టుకోకూడదనుకున్నా. మరో రెండ్రోజుల్లో ఆదివారం అనగా ఆఫీసు పని మీద అర్జంటుగా విజయవాడ వెళ్ళాల్సిన పని పడింది. స్టేషన్ కెళ్ళేముందు విశ్వనాథంగారికి ఫోన్ చేసి వూరెళ్తున్న విషయం చెప్పాను.

"మంచిది బాబూ... ఉద్యోగాల మీద ఆధారపడిన బతుకులు కదా మనవి. ఆ బాధ్యతల్ని నిర్లక్ష్యం చేయడం మంచిదికాదు. నీతో మాట్లాడాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి బాబూ. ఫోన్లో చెప్పేవి కావు. నువ్వు క్యాంప్ నుంచి తిరిగొచ్చాక ఓసారి రా. నిన్ను మరి మరి ఇబ్బంది పెట్టనులే. ఒక్కసారి రా బాబూ చాలు. చూసి ఎన్నాళ్ళయిందో"

"నాకూ రావాలనే ఉంది. ఇన్నాళ్ళూ తీరిక దొరక్క..." నీళ్ళు నమిలాను.

"నేనర్థం చేసుకోగలనులే. ఎన్ని పనుల్తో సతమతమౌతుంటావో... అన్నీ తెల్సినా నిన్ను చూడాలనే కోరిక బలంగా ఉండటం వల్ల పదే పదే అడుగుతున్నా బాబూ. మరోలా అనుకోకు. ఒక్కసారి కన్పించి వెళ్ళు."

"టూర్ నుండి తిరిగి రాగానే వస్తాను. నాలుగైదు రోజులు మించి పట్టకపోవచ్చు"

"నేను నీ రాకకోసం ఎదురుచూస్తుంటా బాబూ" అన్నారాయన.

విజయవాడలో పనులు చేసుకుంటున్నా విశ్వనాథంగారు చాలాసార్లు గుర్తుకొచ్చారు. అమెరికాలో ఉన్న కొడుకుల్ని తరచూ రమ్మని పిలవలేరుగా... దూరాభారం కదా. నేను దగ్గర్లో ఉండి కూడా ఇంత దూరం ఎందుకయ్యాను? ఎక్కడికని పరుగు పెడ్తున్నాను? తీరిక లేనంత పరుగు... ఆత్మీయుల్ని కల్సుకోడానికి, పల్కరించడానికి అవరోధంలా మారిన జీవన శైలి... పక్కనే ఉన్నా వేల మైళ్ళ దూరంలో ఉన్నట్లు... నాలో సుడులు తిరుగుతూ బాధ...

హైద్రాబాద్ తిరిగొచ్చిన రోజే సాయంత్రం అరింటికి విశ్వనాథం గారింటికెళ్ళాను.

యింటికి తాళం వేసి ఉంది. పక్కవాళ్ళనడిగాను. మూడ్రోజుల క్రితం మరలా గుండెనొప్పి వచ్చిందట. అపోలో హాస్పిటల్‌లో చేర్పించారట.

వెంటనే యింటికెళ్ళి అమ్మను పిల్చుకుని అపోలో ఆస్పత్రికెళ్ళాను. నిర్మలగారు శోకదేవతలా కూచుని ఉన్నారు. విశ్వనాధంగారు మూడ్రోజుల్నించి ఐసియూలో ఉన్నారట. డాక్టర్లు లాభం లేదని చెప్పారంటూ భోరుమని ఏడ్చారు.

నేనూ అమ్మా ఆమెకు చెరో పక్కా కూచున్నాం. మరో గంటకు విశ్వనాధంగారు చనిపోయినట్లు డాక్టర్లు చెప్పారు. పార్థివ శరీరాన్ని తెచ్చి రూంలో పడుకోబెట్టారు.

నాకు కన్నీళ్ళు ఆగటంలేదు. వారిని చూస్తున్నాను. నన్ను చూడాలని తహతహలాడిన విశ్వనాధంగారు మాత్రం నేను ఎదురుగా నిలబడి ఉన్నా చూడటం లేదు. నేను వారితో మాట్లాడుతున్నాను. నాతో చెప్పాలనుకున్న విషయాలేమిటో చెప్పమని వారిని కదిపి కదిపి... కుదిపి కుదిపి అడుగుతున్నాను. వారు అనంత మౌనంలో ఒదిగిపోయారు. నా మీద అలిగినట్టున్నారు.

ఇక ముందు ఎంత తీరిక దొరికినా కల్సుకోవడానికి వారుండరనే నిజం గుండెల్ని యినుపహస్తాల్లో పట్టి పిండేస్తూ...

"నావైపు చూడండి. మీ మానసపుత్రుణ్ణి వచ్చాను. ప్లీజ్... నాతో మాట్లాడండి... నాకిప్పుడు చాలా తీరిక ఉంది. ఏ పనీ పెట్టుకోను. ఆఫీసుకి శెలవు పెడ్తాను. మీదగ్గర వారమంతా కూచోమన్నా కూచుంటాను. ఒక్కసారి మాట్లాడండి. క్షమించండి. ఇంకెప్పుడూ తీరికలేదని చెప్పను" విలపిస్తూ చెప్పాను.

(ఆంధ్రభూమి దినపత్రిక - 19 ఏప్రిల్ 2008)